# అమ్మ

ప్రఫుల్ల చంద్ర



**మరోగంటలో పెళ్లిచూపులనగా రజనికి ఒక ఉత్తరం వచ్చింది. స్నేహితురాలు రమ్యతో కలిసి ఆ ఉత్తరం చదివాక ఆమె ముఖం మాడిపోయింది.**

తన గ్రామంలోనే ఒక కోచింగ్‌సెంటర్‌లో లెక్చరర్‌గా పనిచేస్తున్న రమణి రాసిన ఆ ఉత్తరంలో - పెళ్లిచూపులకు వస్తున్న రఘు గురించి అవాకులూ, చెవాకులూ ...

అవి ఎంతవరకు నిజమో, ఏం చేయాలో తోచక బిక్కమొహం వేసిన రజనిని బలవంతంగా లాక్కుపోయి ముస్తాబు చేసింది అమ్మ.

అరగంట ఆలస్యంగా రఘు, తల్లి, చెల్లి పెళ్లిచూపులకు వచ్చారు. మర్యాదలూ, ముచ్చట్లూ అయ్యాక అమ్మాయీ, అబ్బాయీ మాట్లాడుకోడానికి వీలుగా అందరూ గది విడిచి వెళ్లిపోయారు.

## మరో ప్రేమ చిహ్నం

## 'రూబీ'

తన భార్య ముంతాజ్‌మీద ప్రేమకొద్దీ షాజహాన్ తాజ్‌మహల్‌ను కట్టించాడు. అయితే అంతకంటే 15 సంవత్సరాలకు ముందే మార్క్ అనే అతను తన భార్య రూబీ 55వ పుట్టినరోజు కానుకగా ఓ పాత థియేటర్ని కొని, బోలెడంత ఖర్చుపెట్టి గొప్పగా కట్టించి మరీ ఆమెకు ప్రేమచిహ్నంగా సమర్పించాడు. దక్షిణ లండన్ ప్రాంతం క్లాఫ్‌హోమ్‌లో 'రూబీ' అనే పేరుతో ఇప్పటికీ వ్యవహరింపబడుతోంది.

**శ్రీకొండ** (ఎర్రబోడు)

కానీ, "పార్కులో అయితే ఫ్రీగా మాట్లాడుకోవచ్చు. రేపు సాయంకాలం ఐదుగంటలకు పార్కులో కలుద్దాం!" అంటూ మరోమాటకు అవకాశం ఇవ్వకుండా లేచాడు రఘు.

* * *

పార్కులో పూలులేని మొక్కలు, మొక్కలు లేని కుండీలు, నీళ్లు వెదజల్లని జలయంత్రం, అశోకుడు నాటించిన రెండు మూడు వృక్షాలు ...

ఒక వృక్షం కింద రఘు, రమ్య, రజని కూర్చుని ఐస్‌క్రీమ్ తింటున్నారు.

నూతన వ్యక్తితో పార్కుకి వెళ్లడం - బరితెగించటం అంటారేమోనని రజనికి సంశయం. ఇలాంటి విషయాల్లో రమ్య కాస్త ముందుంటుంది. రజనిని ఒప్పించి పార్కుకి తీసుకొచ్చింది. రఘు మంచివాడిలానే ఉన్నాడు. "ఏమీ సంకోచించకండి. ఫ్రెండ్స్‌లాగ ఫ్రీగా మాట్లాడుకుందాం!" అన్నాడు అని నచ్చజెప్పింది.

అతనికి మూడేళ్లక్రితమే పెళ్లి అయింది. ఏడాది క్రితం విడాకులు.

రెండోపెళ్లివాడని మొదట సంశయించినా, ఇంటి ఆర్థికపరిస్థితి దృష్ట్యా తల్లిదండ్రులకు గుదిబండగా మారి ఐదారు పెళ్లిచూపుల్లో తిరస్కృత అయిన తనను ఎవడో ఒకడు తాళికట్టి తీసుకుపోతే చాలన్న దీనపరిస్థితిలో పెళ్లిచూపులకు ఒప్పుకున్న రజని - రఘుని చూశాక ఊరట చెందింది. ఆమెలో ఆశ చిగురించింది.

ఐస్‌క్రీమ్ తిని రుమాలుతో చేతులు తుడుచుకుంటూ, "నేనెందుకు విడాకులు తీసుకోవలసి వచ్చిందో ఊహించగలరా?" అడిగాడు రఘు.

"మీ తప్పేం లేదు. మీ భార్య పరమ గయ్యాళి...బ్రహ్మరాక్షసి ... కదూ?" వెటకారంగా అడిగింది రమ్య.

అతడు నొచ్చుకోలేదు. "శుద్ధ అబద్ధం! ఆమె నిజంగా చాలా మంచిది. మరో కారణం ఊహించండి" అన్నాడు.

కళ్లు మూసుకుని ఆలోచన నటిస్తూ, "మీరొక అమ్మకూచి! అమ్మ చెప్పిందే నమ్మి పెళ్లాన్ని హింసించేవారు. చెల్లిని వెనకేసుకొచ్చి భార్యను బాదేవారు! మీరొక అందమైన రాక్షసుడు!" ఇంకా ఏదో అనబోతున్న రమ్యని భయం భయంగా వారించింది రజని.

ఈ ఆరోపణలన్నీ రమణి రాసిన ఉత్తరంలోనివే.

"అదీ నిజం కాదు!" గలగలా నవ్వేశాడు రఘు.

"మీరే చెప్పండి, మహాప్రభో!" నమస్కారం పెట్టేసింది రమ్య.

కుటుంబం అంటే ఏమిటని అడిగాడు రఘు గంభీరంగా మారిపోతూ. రమ్య ఏదో చెప్పబోగా ఆపి, రజనిని చెప్పమన్నాడు.

అంతవరకూ తదేకంగా అతనినే చూస్తున్న రజని ఉలిక్కిపడి తలవంచుకుని, "కుటుంబం అంటే భార్య, భర్త ... పిల్లలు ..." అంది తడబడుతూ.

"చూశారా, మీలాంటి ఆధునిక యువతులు కూడా కుటుంబంలో అత్తమామలు, ఆడపడుచులు కూడా ఒక భాగం అని భావించడం లేదు. అందుకే కుటుంబంలో కలతలురేగి భార్యాభర్తలు విడిపోయే ప్రమాదం కూడా ఉంది!" అన్నాడు - తాము విడిపోడానికి అదే కారణం అన్నట్లు.

అతని స్వరం నిష్ఠురంగా వినిపించి రజని నొచ్చుకుంది. "సారీ, నా సమాధానం పూర్తి కాలేదు. పూర్తిగా వినకుండానే మీరు ..." వాక్యం ఎలా పూర్తి చేయాలో తెలియక ఆగిపోయింది రజని.

"సరేలెండి! మీకు పూర్తి మార్కులిచ్చేస్తున్నాను!" అన్నాడు రఘు తేలికగా. అందరూ నవ్వుకున్నారు.

"నిజమే. అత్తమామలూ, ఆడపడుచులూ కుటుంబంలో భాగమే. కానీ వాళ్లు కూడా ఇంటికొచ్చిన కొత్తకోడల్ని తమలో ఒక భాగంగా ఆదరించాలి కదా! అలా ఎంతమంది ఆదరిస్తున్నారు? మీ విడాకుల కథలో మీ వాళ్ల పాత్ర కూడా ఉండొచ్చు కదా!" సూటిగా అడిగింది రమ్య.

నీ అభిప్రాయం కూడా అదేనా? అన్నట్లు రజనివైపు చూశాడు రఘు. ఆమె తల వంచుకుని ఉంది. చీకటి పడుతోంది. పవర్‌కట్ వల్ల చీకటి మరింత చిక్కగా ఉంది. ఆమె ముఖంలో భావాలు కనిపించడంలేదు.

"సరే, మీరు నన్ను విశ్వసించనక్కరలేదు. ఈ పార్కు పక్కనే ఉన్న అదిగో ఆ కోచింగ్‌సెంటర్‌లోనే నా భార్య ... మాజీభార్య ... రమణి పని చేస్తోంది. ఆమెనే అడిగి చూడండి. మళ్లీ ఆదివారం ఇక్కడే కలుద్దాం!" చటుక్కున లేచి గబగబా వెళ్లిపోయాడు రఘు.

"రమణి మీ భార్యా?!" దిగ్భ్రాంతిగా చూస్తూ ఉండిపోయారిద్దరూ.

అభిప్రాయాలు తెలుసుకోడానికీ అవగాహన పెంచుకోడానికి - సంప్రదాయబద్ధమైన పెళ్లి చూపులకంటే ఇలాంటి సీరియల్ పెళ్లిచూపులే నయం అనిపించింది రజనికి. ఆలోచిస్తున్నకొద్దీ రఘు మంచివాడిలానే అనిపిస్తోందామెకు.

కానీ రమణి రాసిన ఉత్తరం?

* * *

అదే పార్కులో ... అదే చెట్టుకింద ...

ఈసారి రమణి, రజని, రమ్య ... ఎవరి ఆలోచనల్లో వారు!

ఇంతకుముందే రమ్య రమణికి ఆ ఉత్తరం ఇచ్చింది. ఆమె చదివి ఉత్తరం తిరిగి ఇచ్చేసి మౌనంగా ఉండిపోయింది.

ఇంక ఉత్కంఠ భరించలేక, "చెప్పండి, మేడమ్!" అంది రజని.

"నీవు వెయ్యినోములు నోచినా ఇంతకంటే మంచిసంబంధం దొరకదు, రజనీ! సంకోచించకుండా వివాహం చేసుకో!" అంది రమణి ఎటో చూస్తూ.

"మరి ఈ ఉత్తరం ఏమిటి? మీరెందుకు విడిపోయినట్టు?" కాస్త చిరాకుగానే అడిగింది రమ్య.

రమణి ముఖంలో మేఘాలు కమ్ముకుని కళ్లు వర్షించాయి.

* * *

తల్లి ప్రేమమీద ఎన్నో కవితలు ... ఎన్నో చక్కని పాటలు ... మరెన్నో చిక్కని సెంటుమెంట్లు.

కానీ, ప్రేమతో కూతురు కాపురాన్నే కూల్చేసే తల్లులుంటారా?

ఉంటారు! అందుకు రమణి తల్లి శాంతమ్మే ఉదాహరణ.

తన పదమూడవయేట ఉమ్మడి కుటుంబంలో కొత్తకోడలుగా చేరి ఆ రాజకీయాల అగ్నిగుండంలో కాలి, అవమానాల కొలిమిలో కణకణ మండి, అవమానాల సమ్మెట పోట్లతో రాటు దేలింది శాంతమ్మ.

రమణి పుట్టిన ఏడాదికే శాంతమ్మ భర్త పోయాడు.

తనను చంపడానికి కూడా సిద్ధపడిన బంధువర్గంతో రాక్షసిలా ఒంటరి పోరాటం జరిపి ఉమ్మడి ఆస్తిలో భర్త భాగాన్ని సాధించుకుంది.

ఖంగున మోగే కంచుకంఠమే ఆమె ఏకైక ఆయుధం! ఆమె వాగ్ధాటి ముందు ఎవరూ నిలబడలేకపోయేవారు. ఆ వాగ్ధాటితోనే ఆమె తనను, తన కూతుర్ని రక్షించుకోగలిగింది.

ఈ దుర్మార్గపు ప్రపంచంలో శాంతమ్మ జీవితంలో సగభాగం కుళ్లు, కుట్రలు, ఎత్తులు, పైఎత్తులు మధ్యనే గడిచిపోయింది. ఆమె కంటికి అందరూ దుర్మార్గులే. తన అండ లేనిదే కూతురు బతకలేదని ఆమె దృఢ విశ్వాసం. కూతుర్ని ఒక అయ్య చేతిలో పెట్టిన తర్వాత కూడా రక్షకురాలి పాత్రను ఆమె విడిచిపెట్టలేకపోయింది. తన రక్షణలో తప్ప కూతురు సుఖపడలేదని ఆమె నమ్మకం.

'అత్తవారింట హాయిగానేవున్నాను మొర్రో!' అని రమణి మొత్తుకుంటున్నా వినక వేరింటి కాపురం పెట్టించాలన్న ప్రయత్నంలో పడింది శాంతమ్మ.

వేరింటి కాపురానికి రఘు ఒప్పుకోలేదు.

ఇలా కాదని ప్రతివారం వాళ్లింటికి వెళ్లి అయినదానికీ, కానిదానికీ తన సహజ కంచు కంఠంతో రగడ చేయడం మొదలుపెట్టింది శాంతమ్మ.

అయినా రఘు లొంగలేదు.

తన మనుగడకోసం, కూతురు భద్రతకోసం జీవితం అంతా పోరాడుతూనే వచ్చిన శాంతమ్మ, ఇప్పుడా కూతురే ఎదురు తిరిగి, నీ రక్షణ నాకు అవసరంలేదు పొమ్మంటే తట్టుకోలేక గుండెపగిలి చస్తుందని రమణి భయం.

అందుకే అమ్మ దాష్టీకాన్ని నివారించలేక, అమ్మ వల్ల తన సంసారంలో రేగుతున్న కలతల్ని తట్టుకోలేక విలవిలలాడిపోయేది రమణి.

వియ్యపురాలితో భీకరంగా తగవుపడి కూతుర్ని తనతో తీసుకొచ్చేసింది శాంతమ్మ. అల్లుడు పరుగెత్తుకుంటూ తమ వెనకే వచ్చేస్తాడని ఆమె నమ్మకం. కానీ రఘు రాలేదు. శాంతమ్మ నమ్మకం వమ్మయి పంతం పెరిగింది. కేవలం బెదిరించడంకోసం కూతురుచేత విడాకులకు నోటీసు పంపించింది శాంతమ్మ. అయినా అల్లుడు తిరిగి రాలేదు.

ఇలా ఒకదాని తర్వాత ఒకటిగా పరిస్థితులు విషమించి విడాకుల మంజూరుకు దారితీసింది.

రమణి ఎం.ఏ.కి విచక్షణ ఉంది. తెలివితేటలున్నాయి. అమ్మ అన్యాయం చేస్తోందని తెలుసు. అయినా తను ఎదిరిస్తే ఆమె గుండె పగిలిచస్తుందన్న ఒకే ఒక్క భయంతో అమ్మ చేతిలో కీలుబొమ్మగా మారి తన సంసారాన్ని కూల్చుకుంది.

* * *

రమణి విషాదగాథ రజని, రమ్యలను కలచివేసింది.

'విడాకులు రద్దుచేసుకుని, మీరు కలిసిపోవడమే మంచిదనిపిస్తోంది మేడమ్!' అంది రజని చివరకు.

"మా అమ్మ చనిపోతే కానీ అది సాధ్యం కాదు, రజనీ!" విషణ్ణంగా నవ్వింది రమణి.

"అంతవరకూ నేను వేచిఉంటా, రమా!" గంభీరంగా వినిపించింది.

అందరూ అటు చూసి ఉలిక్కిపడ్డారు ... రఘు కొద్దిదూరంలో కూర్చుని ఉన్నాడు! రమణి, రఘు ఒకరినొకరు చూసుకుంటూ సంభ్రమంగా ఒక క్షణం ఉండిపోయారు.

"రమా! బాగున్నావా?" ఆర్తిగా అడిగాడు రఘు.

"మీరెలా ఉన్నారు?" తమకంగా అడిగింది రమణి.

ఇద్దరి ముఖాలూ వెలిగిపోతున్నాయి. కళ్లు కాంతిపుంజాలైనాయి.

"మా అమ్మమరణం వరకు నిరీక్షిస్తానన్నారు. కానీ అప్పటికి మనం ముసలి వాళ్లం అయిపోతాం. అత్తగారికి మనవలతో ఆడుకునే అదృష్టం లేకుండా చేసిన వాళ్లం అవుతాం. వద్దు, రఘూ! ఆమెకంత శిక్ష విధించడం న్యాయం కాదు!" అంది రమణి తల వంచుకుని.

కొన్ని క్షణాల మౌనం ... గత మధురానుభూతులలో, భవిష్యత్ ప్రణాళికలలో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి కాబోలు. చివరకు రమణి అంది -

"రజని మంచిపిల్ల. వివాహం చేసుకుని హాయిగా ఉండండి. నేనే వచ్చే జన్మవరకు నిరీక్షించి మీ భార్యనవుతా! ఇదిగో, రజనీ, అప్పుడు మాత్రం నువ్వు నాకు పోటీ రాకు!" జోక్‌లాగా అనబోయింది కానీ ఆమె స్వరం గద్గదం అయింది.

'వచ్చేజన్మలో కూడా శాంతమ్మగారే మీ తల్లి అయితే మీ కథ మళ్లీ వెనక్కి వస్తుంది మేడమ్!' అంది రమ్య.

ఎవరూ నవ్వలేకపోయారు.

కన్నీళ్లు దాచుకోడానికి ముఖం గిరుక్కున తిప్పుకుని చటుక్కున లేచి పరుగులాంటి నడకతో చరచరా వెళ్లిపోయింది రమణి. Ⓟ

